

పులివెందుల మార్క్ దౌర్జన్యం

- కడపలో రూ.8కోట్ల స్థలంపై కన్ను
- ఎక్స్‌వేటర్‌తో చదును
- ఈ స్థలం మాదంటూ అడ్డుకున్న యజమానులు
- నాది పులివెందుల.. నాకోసం అవసరమైతే.. జగన్ వస్తాడంటూ బెదిరింపులు
- అవాక్కైన స్థల యజమానులు


కడపలో పులివెందుల బ్యాచ్ కబ్జా చేసిన స్థలం ఇదే

కడప, మే 17 (ఆంధ్రజ్యోతి): పులివెందుల అంటే నమ్మకం, పులివెందుల అంటే ధైర్యం, పులివెందుల అంటే ఒక సక్సెస్ స్టోరీ.. ఇది సీఎం జగన్ నామినేషన్ సందర్భంగా పులి వెందులలో జరిగిన బహిరంగ సభలో సొంతూరు గురించి ప్రపంచానికి చెప్పిన మాటలు. అయితే ఆయన స్టైల్‌లోనే అంతా రివర్స్.. పులివెందుల అంటే నమ్మకం ప్లేస్‌లో భయం వచ్చేసింది. పులివెందుల.. వైఎస్ కుటుంబం పేరు చెప్పుకొని జిల్లాలో కొందరు దందాలకు పాల్పడ్డారు. భూములు కబ్జా చేశారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో వైజాగ్, హైదరాబాద్, ఇతర ప్రాంతాలలో భూకబ్జాలకు, సెటిల్‌మెంట్లకు పాల్పడినా.. సొంత జిల్లాలో జనానికి ఎలాంటి హాని కలిగించేవారు కాదంటారు. అయితే జగన్ సీఎం అయిన తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన నేత పవన్‌కళ్యాణ్‌లు పులివెందుల రౌడీలు, కడప రౌడీలు అంటూ చెప్పుకొచ్చారు. వాళ్ల మాటలు పక్కనపెడితే సొంత జిల్లాలోనే ఈ ఐదేళ్లలో పులివెందుల మార్కు దౌర్జన్యం, బెదిరింపులు ఇష్టారాజ్యంగా పెరిగిపోయాయి.

జగన్ చెప్పినట్లు ఒకప్పుడు పులివెందుల అంటే నమ్మకం ఉండేది. ఇప్పుడు ఆ పేరు చెబితే భయపడుతున్నారు. మాది పులివెందుల, మాది వైఎస్ అండ్ కో గ్యాంగ్ అని చెప్పి స్థలాలను ఆక్రమిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రి కాక ముందు కడప జిల్లాపై వైసీపీ దాష్టీకం, దందాలు ఉండేవి కావు. అయితే ఇపుడు పులివెందుల పేరు చెప్పుకోవడం, నేను జగన్ అండ్ కో మనిషినంటూ వందల కోట్ల ఆస్తులు కాజేయడమే ఇపుడు చర్చ నీయాంశంగా మారింది. పులివెందుల పేరు చెప్పుకొని కొందరు వైసీపీ మూకలు బద్వేలును చెరబట్టారు. అక్కడ ఖాళీ భూములను ఆక్రమించేసి అడ్డువచ్చిన వారిని బెదిరించి కోట్లాది రూపాయల విలువైన భూములను స్వాధీనం చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కడప పై ఆ మార్కు ఉంది. జగన్ పాలనలో సామాన్య జనం బిక్కుబిక్కుమంటూ బతికారు. ఒకప్పుడు పండగకో, పబ్బానికో ఊరు వెళితే మేము వెళ్తున్నాం.. మా ఇళ్లు కాస్త చూసుకోండంటూ దొంగలు బారిన పడకుండా పక్కింటి వారికి చెప్పి వెళ్తుండేవారు. అయితే జగన్ పాలనలో దొంగల స్థానంలో కబ్జాదారులు వచ్చేశారు. భూములకు విలువ రావడంతో పులివెందుల పేరు చెప్పుకొని వైసీపీ అండ్ కో కబ్జాలకు తెరలేపింది. ఇపుడు పరిస్థితి ఎలా ఉందంటే ఖాళీ స్థలం, ఖాళీ భూమి ఉంటే రెండు రోజులకు ఒకసారి వెళ్లి చూసుకోవాల్సిన పరిస్థితి.

జగన్ జమానాలో..

వైసీపీ అధికారంలోకి వచ్చాక పులివెందుల పరిస్థితే కాదు కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరుకు చెందిన వైసీపీ మూకలు ఇష్టారాజ్యంగా పేదల భూములను తప్పుడు పత్రాలు సృష్టించి లాక్కున్నారు. అందుకే మళ్లీ జగన్ వస్తే మా ఇళ్లు, పొలాలు లాక్కుం టారన్న భయం సామాన్యుల్లో ఉంటే.. పొట్టకూటి కోసం వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేసుకుంటే మళ్లీ జగన్ వస్తే రేటు పెరగడంతో పాటు జే ట్యాక్స్ కట్టాల్సి వస్తుందని అంటున్నారు. ఇక ఎన్నికలు ముగిసి నాలుగురోజులు కాకముందే పులివెందుల పేరు చెప్పి నాది పులివెందుల అంటూ రూ.8కోట్ల స్థలాన్ని కబ్జా చేయడం, ఆ వ్యక్తి కూడా సామాన్యుడు కాదు వైసీపీకి చెందిన వ్యక్తుల భూములనే కబ్జాచేయడం కడపలో హాట్ టాపిక్‌గా మారింది. కడప నగర శివార్లలోని రిమ్స్ సమీపంలో పుట్లంపల్లె సర్వేనెంబర్ 95/1లో గతంలో శివానందపురం హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ పేరుతో ఓ లేఅవుట్ వేశారు. ఒక్కో ప్లాటు ఐదు సెంట్లు వేశారు. 20ఏళ్ల కిందట వేశారు. వాటిని అప్పట్లో సిండికేట్ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగులు కొనుగోలు చేశారు. అయితే అప్పట్లో కడపకు దూరంగా ఉన్నాయి. వసతి లేక కొందరు ఇళ్లు కట్టుకోలేదు. కొందరు పిల్లల పెళ్లిళ్లు, చదువులు, ఇళ్లు, ఆరోగ్య రీత్యా కొందరు అమ్ముకోగా ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి.

అతడు సినిమా స్టైల్‌లో..

మీరు 2005 ఆగస్టు 10న విడుదలైన మహేష్‌బాబు అతడు సినిమా, 2008 ఆగస్టు 2న విడుదలైన పవన్ కళ్యాణ్ జల్సా మూవీ మీకు గుర్తుంటుంది. కడప భూమి కబ్జాకు.. అతడు, జల్సా మూవీలకు సంబంధం ఏంటనుకుంటున్నారా... ఆ సినిమాలను పులివెం దుల బ్యాచ్‌లు ఎక్కించుకున్నాయి. అదే స్టైల్లో కబ్జా చేశారు. 2005లో వచ్చిన అతడు సినిమాలో విలన్ తనికెళ్లభరణి వైట్ అండ్ వైట్ డ్రస్ వేసుకొని చుట్ట తాగుతుండగా పక్కనున్న అనుచరులు గొడుగు పట్టుకుంటారు, పక్కనే ఎమ్మార్వో ఉంటారు. ఆయన అనుచరులు స్థలాన్ని కబ్జా చేస్తుంటారు. ఇక 2008లో వచ్చిన జల్సా సినిమాలో విలన్ గొడుగు కింద కూర్చొంటే స్థలాలను కబ్జా చేస్తుంటారు. ఆ రెండు సినిమాలను రహం తుల్లా బాగా వంట బట్టించుకున్నట్లు ఉన్నాడు. రిమ్స్ సమీపంలో ఉన్న రూ.8కోట్ల స్థలంపై కన్నేశారు. శుక్రవారం రహంతుల్లా అతడు సినిమా స్టైల్లో లాగా వైట్ వైట్‌లో ఉండగా.. అతని అనుచరులు గొడుగు పట్టుకున్నారు. ఎక్స్‌కవేటర్‌తో కంపచెట్లను తొలగిస్తూ భూమిని చదును చేస్తున్నారు. అయితే ఈ విషయం తెలుసుకొని స్థలం ఓనర్లు ఎందుకు మా స్థలంలో చదును చేస్తున్నావని అడిగితే.. రేయ్ నాది పులివెందుల, నేను ఎవరో ప్రపంచానికి తెలుసు. నేను తలచుకుంటే నా కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడకు వస్తారంటూ జగన్‌పేరు చెప్పి బాధితులను బెదిరించారు. అయితే రహంతుల్లా గురించి ఆరా తీయగా 2012లో రహంతుల్లా పులివెందులలో ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో గొడవ జరగ్గా.. అప్పుడే జగన్ వైసీపీని స్థాపించి ఎంపీగా గెలిచారు. ఈ రహంతుల్లా కోసమే జగన్ ధర్నా చేస్తే పులివెందులలో కేసు నమోదైంది. అందుకే తనను అడ్డుపెట్టుకొని నాది పులివెందుల అంటూ బెదిరింపులకు పాల్పడుతూ దౌర్జన్యాలు చేస్తున్నాడు. అయితే రహంతుల్లా కడపలో కబ్జా చేసిన స్థలం కూడా వైసీపీ నేతలదే కావడం గమనార్హం. ఇప్పటికే పులివెందుల బ్యాచ్ పులివెందులలో కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాలను కబ్జా చేశారు. ఆ భయం జనాల్లో ఉంది. ఇక వైట్ అండ్ వైట్‌లో వచ్చి వైసీపీ ముఖ్యనేతల స్థలాలనే కబ్జాచేయాలనే చూడటం వైసీపీ శ్రేణులకే మైండ్ బ్లాంక్ అయింది. మా పరిస్థితే ఇలాగుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటంటూ.. అందుకే మా జగన్ పోతున్నాడంటూ వైసీపీ నేతలు చెప్పుకోవడం కొసమెరుపు.


పులివెందులకు చెందిన రహంతుల్లా



కుటుంబ నియంత్రణలో పడకేసిన ప్రగతి

- లక్ష్యం 20642
- ప్రగతి 8446
- కమలాపురంలో మరింత వెనుకబాటు

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మే 17: జిల్లాలో కుటుంబ నియంత్రణలో ప్రగతి పడకేసింది. ఉమ్మడి కడప జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 20642 కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు లక్ష్యంగా నిర్వహించారు. కానీ జనవరి మాసాంతానికి కేవలం 8446 శస్త్ర చికిత్సలు మాత్రమే సాధించడం జరిగింది. ప్రభుత్వ వైద్యం ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామంటూ ప్రభుత్వం గొప్పలు చెబుతుంది. క్షేత్రస్థాయిలోకి వెళితే నేతి బీరకాయలో నెయ్యి ఉన్నదనేది ఎంత వాస్తవమో పాలకులు చెబుతున్న దాంట్లో అంతే నిజం అన్నట్లు స్పష్టమవుతుంది. చాలా ఆసుపత్రుల్లో ఆపరేషన్లు చేయడంలేదనేది స్పష్టమవుతుంది. గతంలో ఉన్న డాక్టర్లు పదవీ విరమణ చెందడం.. కొత్తగా వచ్చిన వైద్యాధికారులు ఆపరేషన్ల వైపు మొగ్గు చూపకపోవడంతో లక్ష్యం పూర్తి చేసేందుకు ఆటంకాలుగా మారుతున్నట్లు తెలుస్తుంది.

బద్వేలు, పోరుమామిళ్ల, మైదుకూరు తదితర ఆసుపత్రుల్లో ఇటీవల కాలంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను చేయకుండా ఆపివేసినట్లు సమాచారం. గతంలో మెడికల్ ఆఫీసర్లుగా ఉన్న వారు పదోన్నతులు వచ్చి కొంత మంది వెళ్లగా మరికొంత మంది ప్రైవేటు క్లినిక్‌లను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మెడికల్ ఆఫీసర్ల కొరత తీవ్రంగా కనిపిస్తుంది. జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్‌లో కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను అంతంత మాత్రమే చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటుగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలంటే దాదాపు రూ.15వేలు ఖర్చు వచ్చే అవకాశాలున్నాయి. ఈ తరుణంలో ఆపరేషన్ చేసి బిడ్డను తీసిన తరువాత ఖర్చులో ఖర్చుగా చాలా మంది ట్యూబెక్టమీ ఆపరేషన్ కూడా చేయించే పరిస్థితులు ఉన్నాయి. ఇన్ని అవరోధాల మధ్య కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల లక్ష్యం పూర్తి కావడం అనేది ప్రశ్నార్థకమే. ట్యూబెక్టమీ ఆపరేషన్లను ప్రభుత్వ వైద్యశాలలలో ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల లక్ష్యం పూర్తి చేసేందుకు ప్రభుత్వ అధికార యంత్రాంతం ఎంతో శ్రమించే పరిస్థితి ఉండేది. లక్ష్యం సాధించేందుకు ఆరోగ్య సిబ్బందికి ప్రోత్సాహకాలు ఇచ్చేవారు. ఆపరేషన్ చేయించుకునే వారికి తగిన సౌకర్యాలు కల్పించేవారు. ఒక రోజు ఒక్కో ఏరియాకు ఒక వాహనం పెట్టి ఆపరేషన్‌కు తీసుకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆపరేషన్ చేయించుకోవాలి అనుకున్న వారు స్వయంగా చేయించుకుంటున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపకపోతే తాము ఏమి చేయగలమంటూ ఆరోగ్య సిబ్బంది చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. ఇదిలా ఉంటే చాల మంది ప్రజలు స్వయంగా వివిధ మార్గాల్లో గర్భనిరోధక చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇక ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో కుటుంబ నియంత్రణ ప్రగతిని పరిశీలిస్తే.. రాయచోటి 69.1 శాతం ప్రగతి సాధించి ప్రథమ స్థానంలో ఉండగా , కమలాపురం నియోజకవర్గం 32.5 శాతంతో ప్రగతిలో చివరి స్థానంలో నిలిచింది. జిల్లాలో అధికారిక గణాంకాల ప్రకారం కుటుంబ నియంత్రణ కేసుల లక్ష్యం, ప్రగతి పరిశీలిస్తే..

నియోజకవర్గం	లక్ష్యం	ప్రగతి
● జమ్మలమడుగు	1503	951
● కడప	2515.	1049
● కమలాపురం	2685.	728
● మైదుకూరు	1666	815
● ప్రొద్దుటూరు	1946	881
● పులివెందుల	3330	987
● రాయచోటి	1927	1109
● రాజంపేట	1581	540
● కోడూరు	1581	562





రాచమల్లూ.. ఓడిపోతున్నావు.. చాలెంజ్‌కు సిద్ధమా!


- నీలాంటి వారు వెయ్యిమంది వచ్చినా టీడీపీని దెబ్బతీయలేరు
- నీ పరాక్రమాలు, ఆకారాన్ని చూసి భయపడేవారు లేరు
- షర్మిలమ్మ వైఎస్ కూతురు కాదంటావా..
- నీ కూతుళ్లు నీకు పుట్టలేదంటే ఆ బాధ తెలుస్తుంది
- రాచమల్లుపై సీఎం సురేష్ నాయుడు ఫైర్

ప్రొద్దుటూరు, మే 17: ప్రొద్దుటూరులో రాచమల్లు ప్రసాద్‌రెడ్డి నీవు ఓడిపోవడం ఖాయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీఎం సురేష్ నాయుడు చాలెంజ్ చేశారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ సర్కిల్‌లోని పీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. మే 13 న జరిగిన పోలింగ్‌లో రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం వీచిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు హింసాత్మక చర్యలకు దిగుతున్నారన్నారు. టీడీపీకి ఓట్లు వేసిన వారిపై దాడులకు పాల్పడుతున్నారని.. చంద్రగిరి అభ్యర్థిపై ఏకంగా హత్యాయత్నం చేశారన్నారు. నీ స్థాయికి మించి చంద్రబాబుపై మాట్లాడుతున్నావ్.. ప్రొద్దుటూరులో టీడీపీని సమాధి చేస్తా అంటూ ప్రగల్భాలు పలుకుతున్నావ్.. నీవు ఓడిపోతే జీవ సమాధి కావడం ఖాయమన్నారు. రాబోవు రోజుల్లో వార్డు కౌన్సిలర్‌గా కూడా గెలవలేవన్నారు. నీలాంటి వారు వెయ్యిమంది వచ్చినా ప్రొద్దుటూరులో టీడీపీని ఏమి చేయలేరన్నారు. నీవు చెప్పినట్లు వినలేదని పోలీసులను దొంగనాకొడుకులంటూ ఇష్టానుసారం మాట్లాడుతావా.. టూటౌన్ సీఐని రాజుపాళెం ఎస్ఐని నీచంగా మాట్లాడుతున్నావు.. నీకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఇక నీ ఆకారం చూసి భయపడే వారు లేరని.. నీతో పాటు జగన్‌కు కాలం ముగిసిందన్నారు. షర్మి లమ్మ వైఎస్‌కు పుట్టలేదని అవమానకరంగా మాట్లాడుతావా.. నీ కూతుళ్లు నీకు పుట్టలేదంటే ఆ బాధ ఎలా ఉంటుందో నీకు తెలుస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లా_డుతూ ప్రతిపక్షాలన్నీ కలిసి కౌరవసైన్యంగా వచ్చినా ఏం చేయలేరని అహంకారంతో మాట్లాడుతున్నావన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ ఓడిపో తున్నామని తెలసి దౌర్జన్యకాండకు దిగుతున్నారన్నారు. ఇప్పటికైనా మీ దౌర్జన్యాలు ఆపండి.. లేదంటే ప్రతి చర్యలు ఎదుర్కొంటారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఈవీ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మునీర్, పగిడాల దస్తగిరి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వెల్లాల భాస్కర్, మాజీ కౌనిలర్ అంజి, బోగాల లక్ష్మీనారాయణమ్మ, జనసేన ప్రతినిధి జిలాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఎం సురేష్ నాయుడు, బచ్చలపుల్లయ్య ముక్తియార్

ఆర్టీపీపీకి నీటి గండం

- ప్లాంటు రిజర్వాయర్లలో అడుగంటిన నీటిమట్టం
- ఒకటి రెండు రోజులకే నీటి నిల్వలు
- మైలవరం, బ్రహ్మంసాగర్ నీరు ఏపూటకు ఆపూటనే వాడకం
- పెరిగిన విద్యుత్ డిమాండ్
- పూర్తిస్థాయి విద్యుదుత్పత్తితో నడుస్తున్న యూనిట్లు


ఆర్టీపీపీ రిజర్వాయర్‌లో అడుగంటిన నీటి నిల్వలు

ఎర్రగుంట్ల, మే 17: డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీకి నీటి గండం ముంచుకొస్తోంది. ఆర్టీపీపీలో 1650 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల ఆరు యూనిట్లు ఉన్నాయి. రోజుకు సుమారు 60 క్యూసెక్కుల నీరు అవసరం ఉంటుంది. అయితే వేసవి కావడంతో నీటి ఆవిరి భారీగా ఉంటోంది. దీంతో నీటి వాడకం మరింత పెరుగుతోంది. ఆర్టీపీపీ ప్రారంభం నుంచి సమీపంలోని మైలవరం జలాశయం నుంచి నీటి కేటాయింపు ఉంది. అయితే కేవలం 2 యూ నిట్లకు సరిపడా మాత్రమే సరఫరా జరిగేది. ఇక మైలవరం జలాశయంలో నీటి లభ్యత చాలా తక్కువగా ఉండేది. దీంతో ఆర్టీపీపీకి గతంలో తరచూ నీటి సమస్య వెంటాడుతుండేది. 2006లో వచ్చిన నీటి సమస్య ఎప్పటికీ మరువలేనిది. మైలవరంలో నీరు లేకపోవడంతో అనంతపురం జిల్లాలోని పెన్నానది, చిత్రావతిలో బోర్లు వేసి, నది వెంబడి తార్పాలిన్ పట్టలు పరచి నీటిని మైలవరం జలాశయానికి తెచ్చి అక్కడి నుంచి ఆర్టీపీపీకి పైప్‌లైన్ల ద్వారా నీటిని సరఫరా ప్రయత్నాలు చేశారు. అయితే రూ.కోట్లు వెచ్చించినా అది పూర్తిస్థాయిలో సఫలీ కృతం కాలేదు. నీరు లేక ప్లాంటును కొన్ని రోజులు ఆపాల్సిన పరిస్థితి వచ్చింది.

బ్రహ్మంసాగర్ నుంచి పైప్‌లైన్

సొంత జిల్లా వాసి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి 2004 సంవత్సరంలో సీఎం కాగానే ఆర్టీపీపీ నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందుకోసం బ్రహ్మంసాగర్ నుంచి నీటిని తెచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేయించారు. సుమారు రూ.150 కోట్లతో సాగర్ నుంచి ఆర్టీపీపీకి 70కిలోమీటర్లు పైప్‌లైన్ వేసి నీరు తెప్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. దీంతో రోజుకు 38 క్యూసెక్కుల నీరు ఆర్టీపీపీకి వస్తోంది. అప్పటి నుంచి ఇక్కడ రిజర్వాయర్లు నీటితో ఫుల్‌గా వుండేవి. దీంతో నీటి సమస్య తలెత్తలేదు.

నిరాటంకంగా విద్యుదుత్పత్తి

ఈ వేసవిలో భానుడు భగభగలు తారాస్థాయికి చేరడంతో పాటు విద్యుత్ వాడకం భారీ స్థాయిలో పెరిగింది. దీంతో డిమాండ్ గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగింది. ఎన్నికల సమయం కూడా కావడంతో పవర్ కట్ లేకుండా చూసేందుకు ప్రభుత్వం ఇక్కడి యూని ట్లన్నింటిని పూర్తిస్థాయి విద్యుదుత్పత్తితో నడపాలని ఆదేశాలివ్వడంతో రెండు నెలలుగా నిరా టంకంగా నడుస్తున్నాయి. ప్లాంట్లను కనీసం ఓవరాలింగ్‌కు కూడా ఈ సంవత్సరం అవకాశం ఇవ్వకుండా 1650 మెగావాట్ల సామర్థ్యం గల ఆరు యూనిట్లలో నిరాటంకంగా ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. దీంతో ఇక్కడ నీటి వాడకం ఏమాత్రం తగ్గలేదు.

ప్రస్తుతానికి ఇబ్బంది లేదు..

ప్రస్తుతానికి ప్లాంటుకు నీటి ఇబ్బంది లేదు. రెండు జలాశయాల నుంచి వచ్చే నీరు సరిపోతోంది. అయితే నీటి నిల్వ పెంచేందుకు అవకాశం లేదు. జలాశయాల నుంచి నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేసుకున్నాము.

- గౌరీపతి, చీఫ్ ఇంజనీర్, ఆర్టీపీపీ

రిజర్వాయర్లలో అడుగంటిన నీటిమట్టం

ఆర్టీపీపీలోని ఆరు యూనిట్లకు సంబంధించి రోజుకు 60 క్యూసెక్కుల వాడకం ఉంటున్నట్లు తెలుస్తోంది. అయితే ఆర్టీపీపీలో నీటి నిల్వకోసం ఉన్న మూడు రిజర్వాయర్లలో దాదాపు నీళ్లు అడుగంటాయి. రోజు బ్రహ్మంసాగర్ , మైలవరం జలాశయాల నుంచి వచ్చే సుమారు 70క్యూసెక్కుల నీటిని వాడేస్తున్నారు. దీంతో నీటి నిల్వను పెంచే అవకాశం లేకుండా పోయింది. స్టాక్ మొత్తం ఒకటి రెండు రోజులకు మాత్రమే ఉంటోంది. దీనికి తోడు మండుతున్న ఎండలకు రిజర్వాయర్లలో నీరు అధికంగా ఆవిరవుతున్నట్లు సమాచారం. దీంతో నీటి నిల్వలు రోజురోజుకు తగ్గుతున్నాయి. ఏ కారణం చేతనైనా మైలవరం, సాగర్ నుంచి నీటి సరఫరా ఆగిపోతే ఉత్పత్తికి ఆటంకం కలిగే అవ కాశం ఉంది. అయితే నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అధికారులు పెట్రోలింగ్ చేయడం, లీకేజీలను సరిదిద్ది వెంటనే చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.


మట్టి తెరలు కనిపిస్తున్న దృశ్యం



ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.6

పాఠకుని పూర్తి పేరు : ....
దోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

కడప ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. కడప				
2. కమలాపురం				
3. పులివెందుల				
4. జమ్మలమడుగు				
5. ప్రొద్దుటూరు				
6. మైదుకూరు				
7. బద్వేలు				
8. రాజంపేట				
9. రైల్వేకోడూరు				
10. రాయచోటి				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వేనెం. : 137 & 138/3, చిన్నమాచుపల్లె, చెన్నూరు మండలం, కడప

జేఎన్టీయూ బీటెక్ ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రమణారెడ్డి

పులివెందుల రూరల్, మే 17: పులివెందుల జేఎన్టీయూ బీటెక్ రెండవ సెమిస్టర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ఆర్.రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కళాశాలలో ఫలితాల విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి/ఏప్రిల్-2024 నెలలో నిర్వహించిన నాల్గవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, మొదటి, రెండవ, మూడవ, నాలుగు సంవత్సరాల రెండవ సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ ఫలితాలతో పాటు మొదటి, రెండవ, మూడు సంవత్సరాల (ఆర్20) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సూర్యనారాయణరెడ్డి, పరీక్ష కేంద్ర విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల క్రికెట్ ట్రయల్స్‌కు 85 మంది హాజరు


సెలక్షన్స్‌లో బౌలింగ్ వేస్తున్న క్రీడాకారిణి

కడప (స్పోర్ట్స్) మే 17. జిల్లా క్రికెట్ సంఘం సారథ్యంలో శుక్రవారం వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో సీనియర్స్ అండర్-23, అండర్-19 బాలికల క్రికెట్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 85 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారిణులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎల్.మునికుమార్‌రెడ్డి, విష్ణుమోహన్, శివప్రసాద్, ఏసీఏ సౌత్‌జోన్ హెడ్ కోచ్ పి.మధుసూదన్‌రెడ్డి, సీఏవైడీ కోచ్‌లు ఎస్.ఇలియాస్, షేక్ అబూబకర్ హాజరయ్యారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి గురుపూజ



దీక్షాబంధనాలంకారంలో బ్రహ్మంగారు, స్వామి దర్శనం కోసం క్యూలైనులో భక్తులు

బ్రహ్మంగారిమఠం, మే 17 : పోతులూరి వీరబ్రహ్మంగారి ఆరాధన గురుపూజా మహోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు శుక్రవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర సుదినం కావడంతో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు క్యూలైనులో చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఉదయం నుంచి మఠాధిపతుల నివాసం మందిరంలో మాలధారణ వేసిన భక్తులు ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లలో నామస్మరణలతో మార్మ్రోగింది. మాలధారణ చేసిన భక్తులు పీఠాధిపతుల మందిరంలో మాలను విరమించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూలైను ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం యాజమాన్యం క్యూలో ఉన్న భక్తులకు మజ్జిగ, తాగునీటిని పంపిణీ చేశారు. భోజన వసతి, తాగునీరు, విశ్రాంతి భవనాలు సౌకర్యాలను కల్పించారు. అలాగే ఉత్సవాల ప్రత్యేక అధికారి నోడల్ అధికారి యదుభూషణ్‌రెడ్డి ఉత్సవా లను పర్యవేక్షించారు. రాత్రికి భక్తులు జాగారం ఉండడంతో అధిక సంఖ్యలో బి.మఠానికి చేరుకోనున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాలు, హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు అసిస్టెంటు కమిషనర్ శంకరబాలాజీ తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ పరిపాలనాధికారిగా రవికుమార్


నియామకపత్రం అందుకుంటున్న రవికుమార్

జమ్మలమడుగు/ వేంపల్లె, మే 17: జమ్మలమడుగు పట్టణానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెనుగొండ రవికుమార్‌ను శుక్రవారం ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయ నూతన పరిపాలన అధికారిగా నియమించినట్లుగా ఆయన తెలిపారు. డాక్టర్ పెనుగొండ రవికుమార్ అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన జపాన్ యూనివర్సిటీ ఆఫ్ అయిజులో పీహెచ్‌డీ పూర్తి చేసి ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య


మొబైల్ ఫోన్స్ పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

రాయచోటిటౌన్, మే 17: నూతనంగా విధుల్లో చేరిన ఆశా వర్కర్లకు ప్రభుత్వం అందజేసిన మొబైల్స్ ఫోన్స్ ద్వారా వైద్య ఆరోగ్య సేవల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో కొత్తగా విధుల్లో చేరిన ఆశా కార్యకర్తలకు కొత్త సెల్‌ఫోన్స్ సిమ్ కార్డ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాకార్యకర్తలు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని వృత్తి నైపుణ్యం పెంచుకోవడం ద్వారా తల్లి, బిడ్డలకు, సమాజానికి మెరుగైన వైద్య సేవలందించవచ్చన్నారు. ఆశాకార్యకర్తలు విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయడం ద్వారా పేద ప్రజలకు, ఆరోగ్యశాఖకు వారధులుగా నిలిచి మంచి గుర్తింపు, పేరు తెచ్చుకోవాలని ఆదేశించారు. అనంతరం డిప్యూటీ డెమో దేవశిరోమణి మాట్లాడుతూ ఆశాకార్యకర్తలు అన్ని ఆరోగ్య కార్యక్రమాలతో పాటు పీసీపీఎన్, డీటీ చట్టం గురించి ఆడబిడ్డల నిష్పత్తి తగ్గితే కలిగే నష్టం గురించి సమాజానికి, తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో ఓబుల్‌రెడ్డి, ఆశా జిల్లా నోడల్ అధికారి సుగుణ, విజయ్‌కుమార్, జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల నుంచి వచ్చిన నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

రాయచోటిటౌన్, మే 17: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయమ్మ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్యస్వాముల వేదమంత్రోచ్ఛరణల మధ్య భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలను చేపట్టారు.

ఈ సందర్భంగా రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి భద్రకాళీ అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆలయ అర్చకులు రాహుకాల పూజల విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.



పసిడిపురి పీఠం దక్కేదెవరికి?

- బూత్‌ల వారీగా లెక్కలు వేస్తున్న అభ్యర్థులు
- మెజారిటీ వస్తుందన్న ధీమాతో వరద
- గెలుపు తనదే అనుకుంటున్న రాచమల్లు



ప్రొద్దుటూరు, మే 17: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసి అప్పుడే ఐదురోజులు గడిచింది. వైసీపీ, ఎన్డీయే కూటమి మధ్య యుద్ధంలా సాగిన ఈ ఎన్నికలతో రాష్ట్రంలో పలుచోట్ల అల్లర్లు ఘర్షణలు చెలరేగిపోతున్నాయి. కడప జిల్లాలో చెదురుమదురు ఘటనలు తప్ప పెద్దఎత్తున హింస జరగలేదు. శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాలకు గాను 2019 ఎన్నికల్లో వైసీపీ క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎన్నికల్లో మాత్రం వైసీపీకి ఎదురుగాలి తప్పదని ప్రచారం సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో కనీసం ఐదుచోట్ల వైసీపీకి భంగపాటు తప్పదని అంటున్నారు. ఇందులో ప్రొద్దుటూరు ముందువరుసలో ఉందని పోలింగ్ సరళిని బట్టి అంచనాలు వేస్తున్నారు.

ఆది నుంచి పెద్దాయనకు

అనుకూల పవనాలు

ప్రొద్దుటూరులో టీడీపీ టికెట్టు ప్రకటించక ముందునుంచే పెద్దాయన వరదరాజులరెడ్డికి టిక్కెట్టు వస్తే గెలుపు ఖాయం అనే ప్రచారం ప్రజల్లో పెద్దఎత్తున ఉంది. అందులో భాగంగా చంద్రబాబునాయుడు కూడా ప్రొద్దుటూరులో టీడీపీ టికెట్టు రేసులో నలుగురు ఉన్నప్పటికీ సర్వేల ఆదారంగా పెద్దాయనకే టికెట్టు ప్రకటించారు. టికెట్టు ప్రకటించక ముందునుంచే ఆయన పార్టీ కార్యక్రమాలను చురుకుగా ముందుకు తీసుకువెళ్లారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీతో పాటు ఇతర పార్టీ కార్యక్రమాలను చేపట్టారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి అక్రమాలపై కూడా ప్రత్యక్ష పోరాటం చేశారు. దీంతో రాచమల్లుకు పెద్దాయనే సాటి అని.. శిష్యుడి దూకుడుకు గురువే ముకుతాడు వేయగలడనే ప్రచారం ప్రజల్లో వ్యక్తమైంది. ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ఆయన కుటుంబ సభ్యులు గత ఐదేళ్లలో సాగించిన అరాచకాలు, దౌర్జన్యాలు, భూదందాలతో ప్రజలు విసుగుచెందారు. ప్రశాంతంగా ఉన్న ప్రొద్దుటూరులో భయానక రోజులు రావడం.. ఎవరూ ధైర్యం చేసి వారి అరాచకాలను ప్రశ్నించలేని వాతావరణం ఏర్పడింది. దీంతో పెద్దాయన వరదరాజులరెడ్డి రావాలని రాచమల్లును దీటుగా ఎదుర్కోగల సత్తా ఆయనకే ఉందని భావించారు.

రాచమల్లుకు భంగపాటు తప్పదనే ప్రచారం

పదేళ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై సహజంగానే వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. అయితే మొదటిసారి ఆయన ఎమ్మెల్యే అయినప్పుడు వైసీపీ అధికారంలో లేదు. అందువల్ల ఆయన అభివృద్ధి చేయలేక పోయాడని ప్రజలు భావించారు. కానీ రెండోసారి జగన్ గాలిలో భారీ మెజార్టీతో రాచమల్లును ప్రజలు గెలిపించారు. బీసీ వార్డుల్లో ముఖ్యంగా చేనేతల వార్డులలో ఆ సామాజిక వర్గాలు ఓట్లు వేయలేదని రాచమల్లు వారిని విమర్శించారు. దీంతో బీసీలు, చేనేతలు ఓట్లు వేయకుంటే అంత మెజార్టీతో ఆయన గెలిచేవాడా అని ప్రజలు చర్చించుకున్నారు. రాచమల్లు రెండవ సారి తాను అధికారంలోకి వస్తే జగన్ మంత్రి పదవి ఇచ్చినా త్యాగం చేసి ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం ఏడాదికి రూ.500 కోట్ల వంతున ఐదేళ్లలో రూ.2500 కోట్ల నిధులతో ప్రొద్దుటూరు రూపురేఖలే మార్చుతానని లేకుంటే వచ్చే ఎన్నికల్లో ముఖం చూపనని అప్పట్లో హామీ ఇచ్చారు. కానీ ఐదేళ్లలో ఆయన ప్రభుత్వంలో జగన్ ఇచ్చిన నిధులు కేవలం రూ.500 కోట్లు. 13 అభివృద్ధి పనులకు జగన్ శంకుస్థాపన చేసినా వాటికి బిల్లులు మాత్రం రాలేదు. దీంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. రెండుసెంట్ల స్థలం, ఉచితంగా ఇల్లు నిర్మించి పట్టా తాళాలు ఇచ్చే హామీని కూడా రాచమల్లు నెరవేర్చలేకపోయారు. ఆవాసానికి పనికిరాని భూములలో సెంటు స్థలం ఇచ్చి అదే గొప్ప అనే రీతిలో ప్రచారం చేసుకున్నారు. ఆయన ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు కాలేదు. కేవలం గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు అయిన అమృత్ స్కీం ఈ ప్రభుత్వంలో పూర్తయింది. దీంతో ఈ పర్యాయం రాచమల్లుకు భంగపాటు తప్పదనే ప్రచారం మొదటి నుంచీ సాగుతోంది.

సర్వశక్తులు ఒడ్డిన రాచమల్లు

2024 ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించాలనుకోవడంతో ఆయనకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. రాచమల్లు మూడోసారి గెలవడానికి సర్వశక్తులు ఒడ్డి పోరాడారు. కులాల వారీగా ఆత్మీయ సమావేశాలు, భారీగా విందు భోజనాలు పెట్టి హామీలను గుప్పించారు. పకడ్బందీగా ప్రచారంతో పాటు ఎలక్షన్‌లో డబ్బులను విచ్చలవిడిగా ఖర్చుచేశారు. ఓట్లకు ప్రతిపక్షాలకంటే అధికంగా డబ్బులు పంచారు. దీంతో ఆయన గెలుపుపై పూర్తి ధీమాతో ఉన్నారు. అంతేకాకుండా పోలింగ్ సరళిని బూతుల స్థాయిలో అంచనా వేశారు. మహిళలు అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నందున వైసీపీకి ఆ ఓట్లు జగన్ పథ కాల వల్ల పడ్డాయని భావిస్తున్నారు. గ్రామాల్లో సైతం పెద్ద ఎత్తున ఓటింగ్ శాతం పెరగటంపై వైసీపీ ఆశలు చిగురించాయి. వ్యతిరేకత మాములే అని అదంతా అన్ని స్థాయిల్లో పనిచేయదని లెక్కలు వేస్తున్నారు. అయితే గతంలోలా మెజారిటీపై బీరాలకు పోవడంలేదు. గెలుపుపై మాత్రమే కార్యకర్తలకు హామీ ఇస్తున్నారు.

వరదకు స్వల్ప మెజారిటీ వచ్చే

అవకాశం

పోలింగ్ ముగిసి నాలుగురోజులు అయింది. వరద వర్గం గెలుపుపై పూర్తి స్థాయి ధీమాలో ఉన్నారు. స్వల్ప మెజారిటీ రావచ్చని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. ఓటింగ్ గత 2019 ఎన్నికల కంటే రెండు శాతం పెరగడం, పైగా మహిళా ఓటర్లు పురుషులకంటే ఏడువేల మంది అధికంగా పాల్గొనడంపై అందరిలో చర్చ సాగుతోంది. మహిళా ఓటర్లు చంద్రబాబు పథకాలకు స్పందించారని అంటున్నారు. రూ.4వేలకు పెన్షన్ పెంపు, 18ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం, ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్‌సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తామంటూ చంద్రబాబు ఇచ్చిన హామీలపై మహిళలు ఆసక్తిగా ఉన్నారని అంటున్నారు. గ్రామాల్లో ఓటింగ్ శాతం పెరగటం.. టీడీపీకి కొన్ని గ్రామాల్లో పట్టు ఉండటంతో అది తమకే లాభిస్తుందని నేతలు భావిస్తున్నారు. ఏదిఏమైనా ఈవీఎంలలో నిక్షిప్తం అయిన ఓటర్ల తీర్పు, అభ్యర్థుల భవితవ్యం కోసం ఇంకా రెండువారాలకు పైగా ఉత్కంఠ తప్పదు.





పొట్టకూటి కోసం వెళ్తూ పరలోకానికి...


మృతిచెందిన కడప బాషా

రామాపురం, మే 17: పొట్టకూటి కోసం వెళ్తూ మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ కర్ణపువాండ్లపల్లెలో చోటు చేసుకుంది.

సదరు గ్రామానికి చెందిన కడప బాషా (56) బతుకుదెరువు నిమిత్తం ప్రతిరోజు చింతచిగురు కోసుకొని కడప మార్కెట్‌లో విక్రయించి జీవనం సాగిస్తూ ఉండేవాడని, రోజు మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల మధ్యలో బైక్‌పైన చింతాకు తీసుకొని మార్కెట్‌కు వెళ్తున్న సమయంలో సీకే దిన్నె మండలం మూలవంక పెట్రోల్ బంకు వద్ద బైక్ కిందపడి తలకు బలమైన గాయమైంది. 108 ద్వారా రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని భార్య బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాల్లో ఉంది. భర్త మరణ వార్త తెలిసిన వెంటనే హుటాహుటిన కువైత్ నుంచి స్వగృహానికి బయలుదేరిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బాషా మృతిచెందిన సంఘటనతో కర్ణపువాండ్లపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవ కేసులో ముగ్గురికి రిమాండ్

చాపాడు, మే 17: మండలంలోని చిన్నగురవలూరు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసి మైదుకూరు కోర్టులో హాజరుపరచగా కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 13న సోమవారం ఎన్నికల సందర్భంగా ఆ గ్రామంలో టీడీపీ ఏజెంట్లు అయిన ఉగ్రనరసింహులు, వినోద్‌కుమార్‌లను వీరు కొట్టి గాయపరిచారన్నారు. అరెస్టు చేసిన వారిలో సగిలి చంద్ర, రాఘవరెడ్డి, రాము ఉన్నారు. ఇప్పటికే ఎనిమిది మందికి రిమాండ్ విధించినట్లు వారు పేర్కొన్నారు.

రక్తపోటును కచ్చితంగా నిర్ధారించాలి..

కడప (కలెక్టరేట్), మే 17 : ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ప్రతి ఒక్కరికీ రక్త పోటును కచ్చితంగా నిర్ధారించి, అదుపులో ఉంచుకునేందుకు జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజలకు రక్తపోటుతో కలిగే దుష్పరిణామాలు, జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులపై అవగాహన కల్పించాలన్నారు. మన దేశంలో 30 శాతం మంది రక్తపోటు వ్యాధితో బాధపడుతున్నారన్నారు. అధిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు నియంత్రణలో లేకపోవడంతో ఈ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కనీసం నెలకు ఒకసారైనా రక్తపోటును పరీక్షించుకోవాలన్నారు. వైద్యుల సూచన మేరకు మందులు వాడాలన్నారు. 30 ఏళ్లు దాటిన వారందరికీ ఎన్సిడి 2.0లో హైపర్ టెన్షన్, డయాబెటిస్ స్క్రీనింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమ మహేశ్వరకుమార్, డాక్టర్లు రమేష్, సునీత, జిల్లా మలేరియా అధికారిణి మనోరమ, డెమో భారతి, డిప్యూటీ డెమో రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే

- జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ

రాయచోటిటౌన్, మే 17: ఎయిడ్స్ వ్యాధితో తమ జీవితాలను కోల్పోయిన వారి జ్ఞాపకార్థం ఈ నెల 19న అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహించబడుతుందని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకోవడంతో పాటు ప్రతి సంవత్సరం మే నెల మూడవ ఆదివారాన్ని అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

హెచ్‌ఐవీ లేదా ఎయిడ్స్ వ్యాధితో ఎంతో మంది ప్రాణాలు, జీవితాలను కోల్పోయారని, వారి జ్ఞాపకార్థం హెచ్‌ఐవీతో జీవిస్తున్న ప్రజలకు సహాయం చేయడానికి తమ జీవితాలను అంకితం చేసిన వారి సేవలను గుర్తించడం కోసం, సమాజంలో హెచ్‌ఐవీ లేదా ఎయిడ్స్ వ్యాధి వల్ల కలిగే సామాజిక, ఆర్థిక నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఏడు బర్రెలు మృతి



బి.కోడూరు, మే 17 : మండల పరిధిలోని టమటంవారిపల్లె గ్రామానికి చెందిన మడతల సుబ్బలక్షుమ్మకు సంబంధించిన నాలుగు బర్రెలు ద్వారకచర్ల రమాదేవికి చెందిన రెండు బర్రెలు, బొల్ల గుర్విరెడ్డికి చెందిన ఒక బర్రె విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాయి. బర్రెలను శుక్రవారం ఉదయం మేసేందుకు పుల్లీడు గ్రామ పొలాల్లో తోలి వచ్చామని, అక్కడ 11కేవీ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయని వాపోయారు. వాటి విలువ దాదాపు రూ.5లక్షల మేర అవుతాయని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఐదుగురిపై కిడ్నాప్ కేసు

ముద్దనూరు మే 17: రెండు గ్రూపుల మధ్య జరుగుతున్న గొడవలో భాగంగా జిలాని(సాయి)అనే యువకుడి కిడ్నాప్‌నకు సంబంధించి ఐదుగురి పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.సీఐ సమాచారం మేరకు వివరాలు...జిలాని(సాయి),శ్రీధర్(బాబి)రెండు గ్రూపుల మధ్య దాదాపు 3నెలలుగా ఘర్షణ జరుగుతోంది. కాగాగురువారం బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో జిలానీ గ్రూపు, శ్రీధర్ గ్రూపు మధ్య ఘర్షణ జరిగింది.అదే రోజు సాయంత్రం జిలాని అతని స్నేహితుడు జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో హోటల్ వద్ద ఉండగా శ్రీధర్ అతని గ్రూపుతో వచ్చి జిలానీని కారులో కిడ్నాప్ చేశారు. బొందలకుంట సమీపంలోని తారు ప్లాంట్ వద్ద చితకబాది వదిలేశారు.వెంటనే జిలానీ స్నేహితుడు అక్కడికి చేరుకొని జిలానీని ప్రథమ చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బాధితుడు జిలాని ఫిర్యాదు మేరకు శ్రీధర్(బాబి), జగదీష్,బడుగు దుద్దురాజా,సుమంత్(సన్నీ) రవికుమార్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హిజ్రా అనుమానాస్పద మృతి కేసు నమోదు

చిన్నమండెం, మే 17: మండలంలోని కేశాపురం జామాయిల్ చెట్ల వద్ద అనుమానాస్పదంగా గణేశ్ (హిజ్రా) మృతి చెందినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలం, నడిమికండ్రికకు చెందిన గణేశ్ (హిజ్రా) 25 సంవత్సరాలు కేశాపురం గ్రామ పంచాయతీ పరిధిలో గుట్టమోటు ఆంజనేయస్వామి గుడి వెనుక అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా ఉరివేసుకొని మృతిచెందింది. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి విచ్చేసిన పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. అయితే మృతురాలు అన్న శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యంత్రం ఎప్పుడొస్తుందో..?

- వ్యవసాయ పనులు ప్రారంభమైనా పంపిణీ ఊసే లేదు
- ప్రశ్నార్థకంగా మారిన ట్రాక్టర్ల సరఫరా
- పంట నూర్పిడి యంత్రాల పరిస్థితి అలాగే..

కమలాపురం రూరల్, మే 17: మారుతున్న కాలానికనుగుణంగా వ్యవసాయంలో యాంత్రీకరణ అవసరం అనివార్యంగా మారింది. దుక్కి మొదలు పంట చేతికి వచ్చే వరకు ప్రతి దశలోనూ యంత్రాల అవసరం రోజురోజుకూ పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో చిన్న, సన్నకారు రైతులు అవసరాలను దృష్టిలో ఉంచుకుని యాంత్రీకరణ ప్రోత్సహించే విధంగా ప్రభుత్వాలు వ్యవసాయశాఖ ద్వారా యంత్ర పరికరాలు అందిస్తున్నాయి. ఈ పంపిణీ విషయంలో నెలకొన్న నిర్లక్ష్యం పేద, మధ్యతరగతి రైతులకు శాపంగా మారుతోంది. వ్యవసాయ పనులు ప్రారంభం నాటికే యంత్ర పరికరాలు అందుతాయని రైతులు భావించినా ఇంత వరకు వాటి ఊసే లేకపోవడం చర్చనీయాంశమైంది. ప్రతి సంవత్సరం సాగు పెట్టుబడి అంతకంత పెరుగుతున్న ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుంది. మరో వైపు గత కొన్ని సంవత్సరాలుగా కూలీల కొరత కూడా పీడిస్తోంది. లాభసాటి కాదన్న భావనతో రైతులు పశు పోషణ పట్ల ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా వ్యవసాయ పనులన్నింటికీ యంత్రాల అవసరం పెరిగి పోతోంది. నాట్లు, కలుపు, కోత నూర్పిళ్ల తదితర సందర్భాల్లో అవసరాన్ని బట్టి కూలీల ధరలు పెరిగిపోతుండడంతో ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు కనీస పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు రాయితీపై నేరుగా రైతులకు యంత్ర పరికరాలు సరఫరా చేస్తున్నాయి. గతంలో వ్యక్తిగతంగా రైతులకు వారి అవసరాలను బట్టి నిబంధనల మేరకు యంత్రాలు అందజేసేవారు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలో భాగంగా రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 5,6 మంది రైతులతో ఏర్పాటయ్యే సంఘాలకు పరికరాలు, ఇతర పరికరాల అవసరాలకనుగుణంగా రైతు సంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందే ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపించారు. పథకంలో భాగంగా రైతు సంఘాలకు సుమారు రూ.12 లక్షల నుంచి 15 లక్షల విలువైన యంత్ర పరికరాలు 40శాతం రాయి తీతో అందజేయాలి. పది శాతం వరకు సంఘ సభ్యులు భరించాల్సి ఉండగా, మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తారు.

నియోజకవర్గ వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో మొత్తం 81 సంఘా లు ఉన్నప్పటికీ ఆ సంఘాలన్నింటికీ యంత్రాలను అందించాల్సిన అవసరం ఉంది. దాదాపు అన్ని సంఘాలు యంత్ర పరికరాల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. అన్ని సంఘాలు ట్రాక్టర్లకు మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నాయి. నిజానికి ఈ యంత్రాలను ఈ ఏడాది వ్యవసాయ పనులు ప్రారంభానికే సమకూర్చాల్సిన అవసరం ఉంది. అయితే సర ఫరా చేసిన యంత్ర పరికరాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి అవసరమైన రైతులకు నిర్దేశిత అద్దెప్రాతిపదికన అందజేయాల్సి ఉంది. వ్యవసాయ పనులు ప్రారంభమైనా యంత్ర పరికరాల ఊసే లేకుండాపోయింది. ట్రాక్టర్లే కాకుండా మిగిలిన యంత్ర పరికరాలను మాత్రమే సంఘాలకు ఇవ్వాలని ఉన్నప్పటికీ సంవత్సరాలు కావస్తున్నా ఇంత వరకు ఒక్క యంత్రం కూడా సరఫరా చేయలేదని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ అధికారులు కూడా సరైన సమాచారం రైతులకు ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల ప్రాధాన్యత పరమైన అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యంత్ర పరికరాలతో పాటు ట్రాక్టర్లను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.


ట్రాక్టరుతో పొలం దున్నుతున్న రైతు

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

రైతు సంఘాలు ట్రాక్టర్ల కోసం దరఖాస్తులు చేసుకున్నాయి. ఈ విషయంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందగానే నిర్దేశించిన మొత్తాలకు యంత్ర పరికరాలు సంఘాలకు అందజేసేలా చర్యలు తీసు కుంటాం.

-నరసింహారెడ్డి, ఏడీఏ

స్టాకు పాయింట్‌కు చేరిన విద్యాకానుక

కడప (నాగరాజుపేట), మే 17 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతి ఏటా అందించే విద్యాకానుక మండలంలోని స్టాకు పాయింట్లకు చేరింది. శుక్రవారం వైఎస్‌ఆర్ జిల్లాలోని కడప మైదుకూరు, దువ్వూరు మండలాల్లోని స్టాకు పాయింట్లకు నోట్‌బుక్స్ చేరాయి. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఎఎల్ఎస్ కోఆర్డినేటరు విశ్వనాథరెడ్డి, ఏసీఎంవో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఈ నెలాఖరుల్లా విద్యాకానుకలోని అన్ని వస్తువులు స్టాకు పాయింట్లకు చేరుతాయని తెలిపారు. కార్యక్రమంలో కడప మండల విద్యాశాఖ అధికారులు పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్, ఎస్ఎస్ ఏ సిబ్బంది భాస్కర్, కడప మండల సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకులు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు

- బీజేపీ నేతల ఫిర్యాదు

వేంపల్లె, మే 17: వైసీపీ నేతలు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకురాళ్లు విజయలక్ష్మి, సుష్మ, రామచంద్రారెడ్డి, గాలి హరిప్రసాద్, టీడీపీ నేతలు పసుపులేటి వీరభద్ర తదితరులు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వేంపల్లెలో ఎంపీటీసీ సభ్యురాలు భారతి, మైనింగ్ డైరెక్టర్ సల్మా, కృష్ణ తదితర అధికార పార్టీ నేతలు ఇష్టానుసారంగా అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఎలాంటి రాయల్టీలు లేకుండా మట్టిని అధిక ధరలకు అమ్ముకుంటున్నారని తెలిపారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, అధికారులు అడ్డుకోకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు.


అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని డీటీకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ, టీడీపీ నాయకులు

దోమల నివారణకు సహకరించండి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

పెండ్లిమర్రి, మే 17: దోమల నివారణకు సహకరించాలని నందిమండలం పీహెచ్‌సీ డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని నందిమండలం-1 సచివాలయం పరిధిలో డ్రైడే - ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ దోమల నివారణకు ప్రతి శుక్రవారం ఇళ్లలోని నీటి తొట్లు, కుండలు, కూలర్లు, టైర్లు, రోళ్లు, టెంకాయ చిప్పలు తదితర వాటిని శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి మురళి, రామ ప్రతాప్, ఎంపీహెచ్‌ఈఓ రవీంద్రనాథ్, వెంకటసుబ్బమ్మ, సూపర్వైజర్ రేవతి, ఏఎన్ఎమ్, సుబ్బలక్ష్మి, ఆశావర్కర్ పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవు

వల్లూరు, మే 17: మండల పరిధిలోని ప్రజలు వివిధ పార్టీల వారు గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలని గొడవలకు తావు ఇవ్వవద్దని వల్లూరు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం వల్లూరు మండల పరిధిలోని దిగువపల్లె, పైడికాల్వ గ్రామాల్లో పోలీసు సిబ్బందితో వీధివీధినా తిరిగి ప్రజలంతా ప్రశాంతంగా ఉండాలని కోరారు. గొడవలు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని హెచ్చరించారు. రౌడీషీట్స్ ఓపెన్ చేస్తామన్నారు. చట్టానికి లోబడి ఉండాలి, ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కమలాపురం రూరల్: మండలంలో గొడవలు సృస్టించినా అల్లర్లకు పాల్పడినా చర్యలు తప్పవని ఎస్ఐ రుషికేశవరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలు దృష్టిలో ఉంచుకుని ఎంతటి వారిపైన అయినా నాన్ బెయిలబుల్ కేసులు రిజిస్టరు చేసి, జైలుకు పంపుతామన్నారు. రౌడీషీట్ కూడా ఓపెన్ చేసి గ్రామం నుంచి బహిష్కరిస్తామన్నారు. సోషల్ మీడియాలో రాజకీయపరంగా రెచ్చగొట్టే పోస్టులు పెటిన వారితోపాటు, గ్రూప్ అడ్మిన్‌పై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కావున ఎవరూ గొడవలు అల్లర్లు సృష్టించ వద్దని, ఏదైనా సమస్య ఉంటే పోలీసుస్టేషన్‌కు రావాలన్నారు.

ఖరీఫ్‌కు రైతులు సిద్ధం

- బోర్ల కింద ముమ్మరంగా సేద్యం పనులు

చెన్నూరు, మే 17 : మండలంలోని రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. పలువురు సేద్యం పనులు పూర్తి చేశారు. ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన జీలుగ, జనుము విత్తనాలను చల్లుకున్నారు. కాల్వ గట్లను శుభ్రం చేసుకున్నారు. కేసీ కాల్వ కింద ఉన్న పలువురు రైతులు ఒక్కో పంటకు ఎకరాకు 4 బస్తాల ధాన్యం కౌలుగా చెల్లిస్తామంటూ బోర్లు ఉన్న రైతులతో ఒప్పందాలు సిద్ధం చేసుకున్నారు. చెన్నూరు, ఉప్పరపల్లె, చిన్నమాచుపల్లెలో మినహాయిస్తే రామనపల్లె, ఓబులంపల్లె, బలిసింగాయపల్లె, కొండపేట ప్రాంతాల రైతులు పనులు ప్రారంభించారు. వ్యవసాయాధికారి శ్రీదేవి ఖరీఫ్ సీజనులో వరి సాగుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ధాన్యం రకాలపై రైతులకు అవగాహన కల్పించారు.


పచ్చిరొట్ట సాగుకు సిద్ధం చేసుకున్న పొలం

ఏపీ ఈఏపీ సెట్ కేంద్రాలను తనిఖీ చేసిన వైవీయు వీసీ

కడప (ఎర్ర ముక్కపల్లె), మే 17 : ఏపీ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ -2024 జరుగుతున్న కేంద్రాలను వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఆయన కడపలోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీ అండ్ సైన్స్, కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలకు వచ్చారు. కంప్యూటర్‌బేస్డ్ పరీక్షలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. పరీక్ష జరుగుతున్న తీరు గురించి ఆయన గమనించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

కడప (ఎర్రముక్కపల్లె), మే 17 : కడప నగరం గౌస్‌నగర్ 27వ డివిజన్ టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ సయ్యద్‌వలి అనారోగ్యంతో బాధపడుతూ హోలిస్టిక్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు అక్కడికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా సూచించారు.

ఎవరైనా రెచ్చగొడితే.. స్పందించకండి

- శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి వినతి

కడప (ఎర్ర ముక్కపల్లె), మే 17 : ఎన్నికల అనంతరం రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాని వల్ల ఘర్షణకు దారి తీసే అవకాశం ఉన్నదని, కావున అందరూ సంయమనం పాటించాలని, అమాయకులు బలి కావద్దని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో టీడీపీ కార్యకర్తలు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. దాదాపు ఆరు నెలలుగా పార్టీ కోసం, తన గెలుపు కోసం కష్టపడిన వారందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తామని, ఎవరి ప్రలోభాలకు, ప్రతిపక్ష పార్టీల రెచ్చగొట్టే వ్యాఖ్యలకు స్పందించ కుండా సంయమనం పాటించాలని పిలుపునిచ్చారు. ఈ సమయంలోనే మనందరం శాంతి సంయమనం పాటించాలన్నారు. ప్రతిపక్ష పార్టీ ట్రాప్‌లో ఎవరూ పడవద్దన్నారు.

కవ్వింపు చర్యలకు స్పందించవద్దు: గోవర్ధన్‌రెడ్డి

ఓడిపోతున్నామనే నిరుత్సాహం వైసీపీ కేడరులో ఉందని, ఇది ఎంత వరకైనా బరి తెగించేలా చేస్తుందని మన ఇళ్ల వద్దకు వచ్చి కవ్వింపు చర్యలకు పాల్పడినా సంయమనం పాటించాలని టీడీపీ రాష్ట్ర కార్యవర్గనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో కోరారు. మనం కూడా రెచ్చిపోతే కేసులు పెట్టి లోపల వేసే ఎత్తుగడతో ఉన్నారన్నారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని జూన్ 4 వరకు ఓపిక పట్టాలని అన్నారు. మన ప్రభుత్వం ఏర్పడ్డాక మనల్ని ఇబ్బందులపాలు చేసిన వారికి తగిన గుణపాఠం చెప్పవచ్చన్నారు.

మురుగు కాలువల పూడ్చివేతతో ఇబ్బందులు

పులివెందుల రూరల్, మే 17: పులివెందుల మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామంలో మురుగునీరు నీరు ప్రవహించకపోవడంతో పారిశుధ్య సమస్య తీవ్రంగా మారింది. గ్రామంలోని పలువురు రైతులు తమ తోటల వద్దకు వెళ్లేందుకు మట్టి రోడ్లు ఏర్పాటుచేసుకున్నారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న మురుగు కాల్వలను మట్టితో పూడ్చేశారు. దీంతో వాటిలో మురుగునీరు ప్రవహించేందుకు అవకాశం లేక జనావాసాల్లో మురుగు పేరుకుపోతోంది. దీంతో దుర్గంధం వెలువడడమే కాక, దోమలు పెరిగిపోయి అనారోగ్యంబారిన పడుతున్నారు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆయా రైతులను ప్రశ్నిస్తే.. మీ పని మీరు చూసుకోండి అని బెదిరిస్తుండడంతో మరోసారి ప్రశ్నించేందుకు ప్రజలు జంకుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఇళ్ల సమీపంలో నిలిచిన మురుగునీరు

నిరంతరం అప్రమత్తతతో నిఘా పెట్టాలి

- స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత సిబ్బందికి ఎస్పీ సూచన


సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ

కడప క్రైం, మే 17: నిరంతరం నిఘా పెట్టి అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం రిమ్స్ పరిధిలోని ఉర్దూ నేషనల్ యూనివర్సిటీ వద్ద ఈవీఎం బాక్స్‌లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయినంత వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అవాంచనీయ సంఘటనలకు తావివ్వకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని.. నలుగురి కంటే ఎక్కువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిఘా కెమెరాలతో పర్యవేక్షించాలని ఆదేశించారు. యూనివర్సిటీ పరిసర ప్రాంతాలను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ క్రిష్ణారావు, కడప డీఎస్పీ షరీఫ్, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, డీఎస్పీలు రమాకాంత్, రవికుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి దేవుని కడపలో తెప్పోత్సవాలు

కడప (కల్చరల్) మే 17: దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ సమీప పుష్కరిణిలో (కోనేరు) ఈనెల 21వ తేదీ మంగళవారం నుంచి 23వ తేదీ గురువారం వరకూ స్వామి వారి తెప్పోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో తెప్పోత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం శ్రీకృష్ణ-గోదాదేవి తెప్పపై మూడు ప్రదక్షిణలు, బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారు ఐదు ప్రదక్షిణములు, చివరగా గురువారం శ్రీదేవి-భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారిని ఏడు ప్రదక్షిణలు చేయనున్నారు. అత్యంత మనోహరంగా నిర్వహించనున్న తెప్పోత్సవాలను తిలకించి స్వామివారి సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులు కావాలని దేవుని కడప దేవస్థానం ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి కోరారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ వ్రతం

కడప (కల్చరల్) మే 17: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం కడప వారి సారథ్యంలో స్థానిక అమ్మవారి శాలలో వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు వాసవీ వ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు తీర ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సి. పుల్లయ్య, ఆర్. రమేష్‌బాబు, ఎస్. వెంకటేశ్వరరావు, సి. మధు, పి.శ్రీనివాసగుప్త, పరిటాల వెంకట రమణయ్య, ఎం. నరసింహ్మప్రసాద్, గోపాలకృష్ణ, రాజేష్‌కుమార్, ప్రసాద్, సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన

సికెదిన్నె, మే 17: మండలంలోని మూలవంక గ్రామంలో శుక్రవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి ఆరాధన సందర్భంగా యాగం, కల్యాణోత్సం నిర్వహించారు. పురోహితులు భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు మండల వ్యాప్తంగానే కాక, కడప నగరం నుంచి కూడా భక్తులు హాజరయ్యారు.


పూజలందుకున్న వీరబ్రహ్మేంద్రస్వాములవారు

ఎల్ఐసీ- శాంతిగిరి ఆధ్వర్యంలో వైద్యశిబిరం


వైద్య శిబిరంలో వైద్యులు, ఎల్ఐసీ సిబ్బంది

కడప (సెవెన్‌రోడ్స్), మే 17 : ఆధునిక వైద్యం బాగా విస్తరించిన నేటి కాలంలో కూడా ప్రాచీన వైద్య విధానాలైన ఆయుర్వేద, సిద్ధ వైద్యవిధానాలు నేటికీ అనుసరణీయమని కడప ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజరు జీకేఆర్‌వీ రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఎల్ఐసీ- శాంతిగిరి ఆయుర్వేద సిద్ధ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయుర్వేదం వ్యాధిని నయం చేయడంపై దృష్టిపెడితే సిద్ధ ఆరోగ్యాన్ని సమకూరుస్తుందని, శారీరక వ్యవస్థ మొత్తాన్ని పునరుజ్జీవం చేస్తుందన్నారు. శాంతిగిరి ఆయుర్వేద - సిద్ధ హాస్పిటల్ బాధ్యులు, వైద్యశిబిరంలో పాల్గొన్న ఆరోగ్య నిపుణులు డాక్టర్‌ఆదర్శ్ ఆజయ్, డాక్టర్ వందన, టీఎస్ మాట్లాడుతూ వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పి, కీళ్ల నొప్పి చర్మసంబంధ సమస్యలకు సేవలు అందించామని తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల రోగులు వైద్యసేవలు పొందారన్నారు. ఈ శిబిరంలో శాంతిగిరి ఆసుపత్రి మేనేజరు మోహన్, సీనియర్ అసిస్టెంటు పుష్పలత, సీనియర్ థెరపిస్టులు మను, మిథున్ సేవలు అదించారు. మార్కెటింగ్ మేనేజరు శ్యాంసుందర్‌రావు, సేల్స్ మేనేజరు సాల్మన్, ఆనంద్‌రావు, రఘునాథరెడ్డి, అవధాన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు మంజూరు

లింగాల, మే 17: మండలానికి 18 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది క్వింటాళ్ల జీలుగలు, నాలుగు క్వింటాళ్ల పిల్లిపెసర, నాలుగు క్వింటాళ్ల జనుము విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. వరి సాగుచేసే రైతులకు 50 శాతం సబ్సిడీతో వీటిని పంపిణీ చేస్తామన్నారు. పార్నపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలోని వరి సాగుచేసే రైతులు సిబ్బందిని సంప్రదించాలని కోరారు. జీలుగలు, జనుము క్వింటా రూ.8800 కాగా సబ్సిడీ పోను రైతు రూ.4400, పిల్లిపెసర క్వింటా రూ.13400 కాగా సబ్సిడీ పోను రూ.6700 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

చెన్నూరు: 2024 ఖరీఫ్ సీజనుకు గాను మండలానికి 150 క్వింటాళ్ల జీలుగ, 20 క్వింటాళ్ల జనుము విత్తనాలు మంజూరయ్యాయి. రైతు భరోసా కేంద్రంలో ఆధార్ కార్డు, పట్టాదారుపాస్ బుక్కు, మొబైల్ ఫోనుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని, 50 శాతం సబ్సిడీతో తీసుకుపోవాలని వ్యవసాయాధికారి తెలిపారు. జీలుగ, జనుము విత్తనాలు కిలో 88 రూపాయలు కాగా, సబ్సిడీ 44 ఉంటుందన్నారు. ఎకరాకు ఒక్కో రైతుకు పది కిలోల బ్యాగ్ చొప్పున గరిష్ఠంగా 5 ఎకరాలకు మాత్రమే ఇవ్వనున్నట్లు వ్యవసాయాధికారి తెలిపారు.

రక్తపోటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


బోడివారిపల్లెలో రక్తపోటు బాధితులకు సూచనలిస్తున్న హెచ్‌ఈ మల్లయ్య

పులివెందుల రూరల్, మే 17: రక్తపోటు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తొం డూరు పీహెచ్‌సీ డాక్టర్ అ రీఫుల్లా సూచించారు. శుక్ర వారం తొండూరు మండలం లోని బోడివారిపల్లెలో ఫ్యా మిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రపంచ హైపర్ టెన్షన్ (రక్తపోటు) దినోత్సవం సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ మల్ల య్య ప్రజలకు అవగా హన కల్పిస్తూ 30ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరు రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తపోటు ఉన్న వారు ఉప్పు, ఊరగాయలకు దూరంగా ఉండాలన్నారు. పొగాకు, మద్యా నికి దూరంగా ఉండడం, అధిక ఒత్తిడి తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

కడప (మారుతీనగర్) మే 17: 2023-24 విద్యా సంవత్సరం 10వ తరగతి, ఇంటర్ మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన జిల్లాలోని గాండ్ల, తెలికుల వర్గానికి చెందిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాల కోసం ఈనెల 20వ తేదీలోగా జిల్లా అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘానికి పంపించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నాల చెంచురామయ్య తెలిపారు. ఇందులో ప్రధానంగా 10వ తరగతిలో స్టేట్ సిలబస్, ఇంటర్‌మీడియట్‌లో బోర్డ్ ఆఫ్ ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ ఏ.పీ తాలూకు మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థినీ,విద్యార్థుల మెమోలు, ఆధార్‌కార్డులను పంపించాలన్నారు. వాటిని పరిశీలించి తుది జాబితాను తమ రాష్ట్ర సంఘానికి పంపిస్తామన్నారు. గ్రోసు గోపాలకృష్ణయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్ పేరుతో ఈ పురస్కారాలను అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని గాండ్ల వర్గానికి చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9440025135, 9440123661 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

సింహాద్రిపురం, మే 17: మండలంలోని ఎనిమిది జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్నట్లు వైజీఆర్ ట్రస్ట్ చైర్మన్ వై. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 19వ తేదీన ఆదివారం సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి ఈ ఏడు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 24 మంది విద్యార్థులకు నాలుగు వేలు, మూడు వేలు, రెండు వేల రూపాయలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు గురివిరెడ్డి, వెంకటసుబ్బమ్మ గార్ల జ్ఞాపకార్థం అందజేస్తున్నట్లు వారి మనుమడు వైజీఆర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలని కోరారు. ట్రస్ట్ ద్వారా సింహాద్రిపురం మండలంలో విద్యాభివృద్ధికి ప్రోత్సహించడంతోపాటు, పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు శ్రీనివాసులు, శారద, సీఐ మద్దిలేటి హాజరవుతారని తెలిపారు.

చంద్రబాబును కలిసిన వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు , మే 17 : ప్రొద్దుటూరులో ప్రజలు టీడీపీకి స్పష్టమైన తీర్పునిచ్చారని జూన్ 4న ఫలితాలలో అది వెల్లడవుతుందని టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాదులోని టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబును ఆయన స్వగృహంలో కలిసి వరదరాజులరెడ్డి ఆయన కుమారుడు కొండారెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 4న ప్రొద్దుటూరులో టీడీపీ విజయం చంద్రబాబుకు కానుకగా ప్రకటించగలమని తెలిపారు. ఆయన మా మీద నమ్మకం పెట్టుకున్న దానికి శక్తి వంచనలేకుండా పార్టీని గెలిపించడానికి కృషి చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రొద్దుటూరు , మే 17 : విద్యుత్ శాఖ ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలో సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల కోసం ట్రాన్స్‌ఫార్మర్స్ మెయింటెనెన్స్ కోసం విద్యుత్ సరఫరాను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం1 గంట వరకు నిలిపి వేస్తున్నట్లు డీఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరులోని 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో పవర్ ట్రాన్స్‌పార్మర్స్ మెయింటెనెన్స్ వలన 33 కేవీ ఐడీఏ, మార్కెట్ యార్డు ఫీడర్, 33కేవీ ప్రొద్దుటూరు టౌన్ ఫీడర్ , 11 కేవీ ఫీడర్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేయడం కోసం ఈ అంతరాయం తప్పదని ఆయన తెలిపారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

ముద్దనూరు మే17:మండల పరిధి కడప తాడిపత్రి హైవే రోడ్డులోని కొత్తపల్లె వద్ద నున్న పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది.ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లెకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ షరీఫ్‌నకు తీవ్రగాయాలయ్యాయి. 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, మే 17: ఎర్రగుంట్ల కుమ్మరవీధికి చెందిన వల్లపురెడ్డి సుదర్శనరెడ్డి(38)శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆరోగ్య సమస్యల వల్లే అతను ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడు ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులున్నారన్నారు.

ప్రవీణ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కామిశెట్టి బాబు



మాట్లాడుతున్న కామిశెట్టి బాబు

ప్రొద్దుటూరు , మే 17 : తనకు టీడీపీ టిక్కెట్టు రాలేదని అసంతృప్తితో పార్టీకి వెన్నుపోటు పొడిచి అనుచర వర్గాన్నంతా వైసీపీలోకి పంపి పోలింగ్ నాడు కూడా టీడీపీ అభిమానులందరికీ వైసీపీకి ఓటేయమని చెప్పిన టీడీపీ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి పై పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కామిశెట్టి బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయ విలేకరులతో మాట్లాడుతూ ప్రవీణ్‌రెడ్డికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చారి ఇచ్చేటప్పటికీ ఆయనకు టీడీపీ పార్టీలో సభ్యత్వం లేదన్నారు. మరి ప్రవీణ్‌రెడ్డికి కంటే దశాబ్దాల ముందు నుంచి పార్టీలో పనిచేస్తున్న వారిని కాదని ఆయనకు ఇన్‌చార్జ్ ఇస్తే నాడు వారంతా పార్టీ మీద అభిమానంతో పార్టీ నిర్ణయాన్ని గౌరవించి నీకు సహకరించలేదా అన్నారు.కానీ నీవు చేసిందేమిటన్నారు. టిక్కెట్టు రాలేదని నిన్ను పార్టీ అధినేత చంద్రబాబు ప్రొద్దుటూరు శివాలయం సర్కిల్లో నీకు పార్టీలో నీకష్టానికి తగిన న్యాయం చేస్తానని బహిరంగంగా హామీ ఇచ్చారన్నారు. రాజంపేటకు మళ్ళీ పిలిపించి రెండు సార్లు చెప్పి ప్రొద్దుటూరులో పార్టీ గెలుపు కోసం పనిచేయమని చెప్పినప్పటికీ నీవు చేసింది ఏమిటన్నారు. అభ్యర్థి వరదరాజులరెడ్డికి ఎలాంటి సహకారం అందించగపోగా నీ అనుచర వర్గాన్ని వైసీపీకి పంపి పోలింగ్ నాడు ఓట్లు ఆపార్టీకి వేయమని చెప్పావన్నారు. అంతేకాకుండా కమలాపురం నియోజకవర్గంలో కూడా ప్రవీణ్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు వైసీపీకి మద్దతుగా చేశారన్నారు. కమలాపురం అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డికూడా ఈ విషయం వెల్లడించారన్నారు. పార్టీలో వుంటూ పార్టీకి వెన్ను పోటు పొడిచి ద్రోహం తలపెట్టిన ప్రవీణ్‌రెడ్డి పార్టీలో వుండటానికి అనర్హుడన్నారు. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, చీమల రాజశేఖర్‌రెడ్డి,చెంద్రాయుడు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్టు నమోదు



అట్లూరు మండల నాయకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విక్రమ్‌సింహ

అట్లూరు, మే 17 : మండలంలోని వివిధ పార్టీల నాయకులకు శుక్రవారం అట్లూరు పోలీసుస్టేషన్‌లో బద్వేలు రూరల్ సీఐ విక్రమ్‌సింగ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ అనంతరం జరిగే ప్రక్రియలో భాగంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని నాయకులనుద్దేశించి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అట్లూరు ఎస్ఐ కేసీ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: గొడవలు ప్రోత్సహించడం కానీ సృష్టించడం కానీ చేస్తే వారు ఎంతటి వారైనా వారిపై నాన్ బెయిలబుల్‌కేసులు నమోదు చేసి రిమాండుకు పంపుతామని పోరుమామిళ్ల సీఐ చిరంజీవి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూపోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన పోలీసుస్టేషన్ల పరిధిలో రాజకీయ పార్టీల నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు. సర్కిల్ పరిధిలోని రాజకీయ నాయకులు ఎవరు కూడా గొడవలు పెట్టుకోవద్దని ఏదైనా సమస్య ఉంటే పోలీసుశాఖ దృష్టికి తేవాలన్నారు.

కొండాపురం..: వివిధ రాజకీయ పార్టీల వారు గాని, ప్రజలు గాని రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు ఎస్సైలు యోగీంద్ర, చంద్రశేఖర్ లు తెలిపారు.ఎన్నికల అనంతరం జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ఎవరైనా గొడవలు,అల్లర్లకు పాల్పడితే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు.వారిపై రౌడీషీట్స్ ఓపెన్ చేసి గ్రామబహిష్కరణ కూడా చేయడం జరుగుతుందన్నారు.అదేవిధంగా సోషియల్ మీడియా లో కూడా రాజకీయపరంగా రెచ్చగొట్టే పోస్టులు పెడితే పోస్ట్ పెట్టిన వారిపైన, గ్రూప్ అడ్మిన్‌పైనా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ఖాజీపేట..: సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా ఎవరైనా పోస్టులు పెడితే చర్యలు కఠినంగా ఉంటాయని ఖాజీపేట సీఐ రామాంజులు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎన్నికలు అయిపోయినా కోడ్ ఉందని, గ్రామాల్లో పట్టణాల్లో ఘర్షణలకు పాల్పడితే జైలుపాలు కాక తప్పదని, గ్రామ బహిష్కరణతోపాటు రౌడీషీటర్ ఓపెన్ చేస్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తేవాలన్నారు.

బి.కోడూరు..: ఈ నెల 13న జరిగిన ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కౌంటింగ్ వరకు ఎవరూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని, లేదంటే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జయరాములు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం పోలీసుస్టేషన్ పరిధిలోని ఇరుపార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి పది పంచాయతీల పరిధిలోని నాయకులు సంయమనం పాటించాలని లేక అనవసరంగా గొడవలకు దిగితేవారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారుల ఆదేశాలు గట్టిగా తెలిపారు. అలాగే గ్రామాల్లోని ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని స్నేహభావంతో మెలగాలన్నారు. కొంత మంది కావాలని గొడవలు, తప్పుడు మాటలు మాట్లాడి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తారని అటువంటి వాటికి పాల్పడరాదన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ అమ్మవారికి పూజలు



జమ్మలమడుగు, మే 17: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామంలో శుక్రవారం గంగజాతర, ఆవులపబ్బం మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. ఉదయాన్నే గంగమ్మ దేవాలయంలో భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం గ్రామ దేవతలకు పూజలు చేశారు. 11 గంటలకు బొల్లేవు గ్రామోత్సవం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి కలశస్థాపన, ఫలావలి, రతి ముగ్గు, అలంకరణ పూజలు చేపట్టారు. రాత్రి ఆలయం ఎదుట కథలు, పాలేటిగంగకు బోనాలు సమర్పిస్తామని ఆలయ కమిటీవారు తెలిపారు. స్థానిక పోలీసు అధికారులు 144 సెక్షన్ ఉందని, ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులకు సహకరించారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన సిమెంట్ లోడు లారీ

రూ.15 లక్షల ఆస్తి నష్టం



ముద్దనూరు , మే 17 : ముద్దనూరు పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డులో నున్న స్థానిక విజయలక్ష్మి ఇంటిలోకి శుక్రవారం రాత్రి 10:40 గంటల సమయంలో సిమెంట్ లోడు లారీ దూరింది. దీంతో దాదాపు 15లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు ఆవేదనవ్యక్తం చేశారు. జమ్మలమడుగు వైపు నుంచి సిమెంట్ లోడుతో లారీ అతివేగంగా వచ్చి ఇంటిలోకి దూసుకెళ్లింది. ఇంట్లోలోనే దుస్తుల దుకాణం నడుపుతుండటంతో దుస్తులు, ఫ్యాన్సీ ఐటమ్స్, ఫర్నీచర్, ఇంటి ముందుభాగంలో నున్న మొదటి అంతస్థు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కాగా లారీ డ్రైవర్ వాహనంలోనే ఇరుక్కుపోయి మృతి చెందాడు. స్థానికులు భారీగా తరలివచ్చారు. పోలీసు లు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కూటమి సభ్యులు సంయమనం పాటించాలి

కలసపాడు, మే 17 : కూటమి సభ్యులు సంయమనంగా ఉండాలని బద్వేలు మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు రంతు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కలసపాడులో టీడీపీ కార్యకర్తల సమా వేశం నిర్వహించారు. టీడీపీ గెలుపు ఖాయమైందని వైసీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని సంయమనంగా ఉండాలని కవ్వింపు చర్యలు చేసినా పట్టించుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, నాయకులు భద్రయ్య,శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులు మంజూరు

కలసపాడు, మే 17 : కలసపాడు మండలానికి పచ్చిరొట్ట ఎరువులు మంజూరైనట్లు ఏవో ఫరూక్ తెలిపారు. 40 క్వింటాళ్ల జీలుగలు, ఐదు క్వింటాళ్ల జనుములు, 4 క్వింటాళ్ల పిల్లిపెసర మంజూరైందన్నారు. 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నామని అన్నారు. దగ్గరలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి పట్టాదారు పాసుబుక్కు, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోను తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

నేడు వాసవీమాత జయంతి వేడుకలు

మైదుకూరు, మే 17: వాసవీకన్యకాపరమేశ్వరీదేవి జయంతి సందర్భంగా శనివారం మైదుకూరులోని అమ్మవారుశాలలో వేడుకలు నిర్వహించనున్నారు. ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో వాసవీమాత మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి, భక్తులచే ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు చేపట్టనున్నారు. అలాగే అలయ ప్రధాన అర్చకుల మంత్రోచ్ఛారణలతో భక్తులచే సామూహిక వాసవీ వ్రతం చేయించనున్నారు.ఈ కార్యక్రమాలకు ఆర్యవైశ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆర్యవైశ్య సభ పేర్కొంది.

ఇరుముడులతో బ్రహ్మంగారి భక్తులు



మైదుకూరు, మే 17 : బ్రహ్మంగారి ఆరాధన సందర్భంగా 41 రోజుల పాటు పవిత్ర నిష్ఠతో సాగిన బ్రహ్మంగారి మాలాదారులు శుక్రవారం ఇరుముడులతో బ్రహ్మంగారిమఠానికి బయలుదేరారు. స్థానిక బ్రహ్మంగారి ఆశ్రమం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టి పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించిన భక్తులు భజనలు, అన్నదానం చేపట్టి శుక్రవారం సాయంత్రం బి.మఠానికి బయలు దేరి వెళ్లారు. అక్కడ పూజల్లో పాల్గొని తమ ఇరుముడులు స్వామివారికి సమర్పించనున్నారు

రైలుకిందపడి మహిళ ఆత్మహత్య

ఎర్రగుంట్ల, మే 17: ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఎలగటూరు లక్ష్మీదేవి(36)అనే మహిళ శుక్రవారం ఉదయం విజయవాడ-ధర్మవరం రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వేపోలీసులు తెలిపారు. బేతంచెర్లకు చెందిన ఈమెకు మతిస్థితిమితం సరిగాలేదని, ఆరేళ్లగా చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారని భర్త వేంకటేశ్వర్లు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడన్నారు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజారాంరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించామన్నారు.

తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 17: తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు చౌడేశ్వరీదేవి తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో 12వ వార్షిక ప్రతిభా పురస్కారాల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ, మున్సిపల్, జడ్పీ, ఎయిడెడ్ పాఠశాలలో 10వ తరగతి చదివి 480కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు, అలాగే ఇంటర్మీడియట్‌లో స్థానిక కళాశాలలో చదివి గ్రూపులవారీగా 80 శాతంపైగా మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషుమీడియంలలో వేరువేరుగా బహుమతులను అందజేస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 26వ తేదీలోపల తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9849203829 నంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, సంఘం ఉపాధ్యక్షుడు ఉమ్మడిశెట్టి చౌడయ్య, సభ్యులు బొలిశెట్టి వెంకటరామయ్య, కుండా నాగరాజు, హరి పాల్గొన్నారు.

రక్త ప్రసరణ హెచ్చుతగ్గులతోనే రక్తపోటు



రక్త పోటు గురించి వివరిస్తున్న వైద్యుడు

ప్రొద్దుటూరు , మే 17 : శరీరంలో రక్త ప్రసరణ సజావుగా లేకపోతే హెచ్చుతగ్గుల వలన రక్త పోటు (బిపి) వస్తుందని షుగర్ కంటే బీపీ ప్రమా దమని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి భరత్ నారాయణ తెలిపా రు. శుక్రవారం శ్రీరాముల పేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు ఏఎన్ఎం ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కామనూరులో...: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా కామనూరు పీహెచ్‌సీలో రక్తపోటు పై అవగాహన సదస్సు నిర్వహించి పరీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాస్, సీహెచ్‌వో కృష్ణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: వైద్యుల సలహాలు పాటిస్తే బీపీని అదుపులో ఉంచుకోవచ్చని వైద్యాధికారి అయేషాసుల్తానా అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ హైపర్ డే కార్యక్రమం డాక్టర్ ముబీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం ప్రభుత్వ వైద్యశాల పరిశీలన



వైద్యసిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం

బి.కోడూరు, మే 17 : బి.కోడూరు ప్రభుత్వ వైద్యశాలను శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషనరీ ఆఫీసరు శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ మాతా శిశుసంక్షేమ సేవలు ప్రజల కందించాలని ఆసుపత్రుల్లో డెలివరీ పెంచాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచనలు అందించారు. అలాగే స్టాటిస్టికల్ ఆఫీసరు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి బుధ, శనివారం వ్యాధి నిరోధక టీకాలు ఉదయం 7 నుంచి 7.30లోపు అందించాలని మధ్యాహ్నం 2గంటలకు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కిశోర బాలికలకు రక్తహీనత రాకుండా ప్రతి గురువారం ఐరన్ మాత్రలు అందించాలని, అలాగే వివాహ వయసుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, డీపీవో నారాయణ, డీఎస్‌వో హరి, ఎంఐఎస్ రాజశేఖర్, వెంకటరత్నం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన, సత్రాల కమిటీ సభ్యులకు ఘన సన్మానం



సభ్యులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

బ్రహ్మంగారిమఠం, మే 17 : వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలకు విచ్చేసిన భక్తులకు భోజనవసతిని స్థానిక శ్రీయాదవ సమాజ అన్నదాన సత్రం, శ్రీకృష్ణ దేవరాయల తెలగ, కాపు, బలిజ అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామాల్లో విరివిగా చందాలను సేకరించిన కమిటీ సభ్యులను సంఘ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. శ్రీ యాదవ సమాజ అన్నదాన సత్రం సభ్యులకు అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శి లక్కినేని బాలరాజుయాదవ్, కోశాధికారి మేకల పెద్దన్నయాదవ్ ఆధ్వర్యంలో 30వేలకు పైన చందాలు వసూలు చేసిన వారికి సన్మానం చేశారు. అలాగే శ్రీకృష్ణదేవరాయల బలిజ, తెలగ కాపు అన్నదాన సత్రంలో ఎక్కువ మొత్తంలో చందాలు వసూలు చేసి సంఘం అభివృద్ధికి తోడ్పడిన వారికి అధ్యక్షుడు గోశెట్టి పిల్లనారాయణ , శ్రీరాములుతో పాటు కార్యదర్శి, కోశాధికారి కార్యదర్శి కమిటి సభ్యులు అందరూ చందాలు వసూలు చేసిన వారికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కార్యనిర్వాహక కమిటీ వారు సభ్యులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో కుక్కల స్వైర విహారం

● ఆరుగురు బాలురపై దాడి ● గాయాలతో ఆసుపత్రి పాలు



ప్రొద్దుటూరు , మే 17 : ప్రొద్దుటూరులో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలో వీటి దాడి పెరిగింది.వీటిని నియంత్రించే చర్యల్లో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారు.ఇందువల్లే కుక్కల దాడికి చిన్నపిల్లలు బలవుతున్నారు. శుక్రవారం రాత్రి స్థానిక మక్కామసీదుకు ఎదురుగా వున్న దొరసానిపల్లె చానల్ వెంబడి సందులలో ఏడుగురు బాలురపై పిచ్చి కుక్క దాడి చేసింది. ఈ వీధులలో మొత్తం తొమ్మిది మంది పిల్లలను ఇది కరిచిందని సంఘటనా స్థలంలో వున్న సాదక్ అనే వ్యక్తి తెలిపారు. పిలలను హుటా హుటినా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళినట్టు తెలిపారు. అక్కడ వైద్య సిబ్బంది వెంటనే పిల్లలకు ట్రీట్‌మెంట్ మొదలెట్టకుండా వివరాలన్నీ రాసుకుని అర్థగంటకు గానీ ట్రీట్ మెంటు ప్రారంభించటేదని బాధితుల తల్లిదండ్రులు వాపోతున్నారు గతంలో ఆశ్రమం వీధిలో కూడా పిల్లలపై వీధికుక్కలు దాడిచేశాయన్నారు. పవర్‌హౌస్‌వీధి, శ్రీరాంనగర్, చెత్తకొట్టాల,దొరసానిపల్లె రోడ్డు, కాలేజీ రోడ్డు ప్రాంతాలలో వీధికుక్కల గుంపులు వున్నాయి. పట్టణంలో అనేక ప్రాంతాల్లో వేలాది కుక్కల గుంపులు రోడ్ల వెంబడి బైక్‌లో వెళ్ళే వాళ్ళను వెంట బడటంతో వారు తరుచు ప్రమాదాలకు గురి అవుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే కుక్కల నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆగ్రహంతో వెల్లడిస్తున్నారు.